మైన్స్ కేసులో న్యాయమే గెలిచింది



దిల్‌సుఖ్‌నగర్: మైన్స్ కేసులో న్యాయమే గెలిచిందని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఓబులాపురం మైన్స్ కేసులో సీబీఐ కోర్టు నిర్దోషిగా తీర్పునిచ్చినందుకు మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ బుధవారం ఎమ్మెల్యేను కలిసి స్వీట్ బాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖిల్లా మైసమ్మ ఆలయ మాజీ చైర్మన్ గౌడుగు శ్రీనివాస్, రాజు నాయక్, సోహెల్, చండిశ్వర్ , సునీల్ నాయక్, అంజయ్య యాదవ్ పాల్గొన్నారు.

మన్సూరాబాద్‌లో కలుషిత నీరు సరఫరా



మన్సూరాబాద్: మన్సూరాబాద్‌లో కలుషిత నీరు సరఫరా కలకలం రేపుతుంది. గత వారం రోజులుగా ఓల్డ్ విలేజ్, ముస్లిం బస్తీలలో కలుషిత నీరు సరఫరా అవుతుంది. మంచినీటిలో డ్రైనేజీ మురుగు కలిసి సరఫరా అవుతుంది. వారం రోజులుగా తాగునీటిలో దుర్వాసన వస్తుందని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి బుధవారం కలుషిత నీటి సరఫరాపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానికులతో కలిసి నిరసన తెలిపారు.

యూడీఐడీ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

చాదర్‌ఘాట్: దివ్యాంగులకు గుర్తింపు కార్డుల కోసం యూనిక్ డిసెబుల్ ఐడెంటిటీ కార్డుల (యూడీఐడీ) కోసం స్వావలంబన పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. స్వావలంబన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొన్న వారికి సమయం ఇచ్చి సంబంధిత హాస్పిటల్‌కు రావాలని చెబుతారని రెండు రోజుల్లో యూడీఐడీ కార్డు జారీ చేస్తారన్నారు.

సరూర్‌నగర్‌లో మాక్‌డ్రిల్



చైతన్యపురి: కేంద్రప్రభుత్వం సూచనల మేరకు సరూర్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. కొత్తపేట చౌరస్తాలో సివిల్, ట్రాఫిక్ పోలీసులు కవాతు నిర్వహించి సైరన్ మోగించటంతో రహదారిపై వెళ్తున్న వాహనదారులు, పాదచారులు రెండు నిమిషాల సమయం పాటు ఎక్కడి వారు అక్కడే కూర్చున్నారు. ఏవైనా దాడులు జరిగినప్పుడు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తల చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ దోహదపడుతుందని ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు.

సీనియర్ సిటిజెన్స్‌కు ఐడీ కార్డ్స్ అవసరం లేదు

చాదర్‌ఘాట్: సీనియర్ సిటిజెన్స్‌కు ఐడీ కార్డ్స్ అవసరం లేదని వికలాంగులు, వయోవృద్ధుల శాఖ డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. బుధవారం మలక్‌పేటలోని కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ఆధార్ కార్డు ఉంటే అదే ఐడీ కార్డు అని ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఐడీ కార్డు జారీ చేయలేదన్నారు. సీనియర్ సిటిజెన్స్ ఐడీ కార్డుల కోసం కార్యాలయానికి రావొద్దని ఆమె సూచించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

నాగోలు: ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఎల్‌బీనగర్ మున్సిపల్ సంఘం జోన్ ప్రధాన కార్యదర్శి మద్దిలేటి పిలుపునిచ్చారు. బుధవారం సరూర్‌నగర్ సర్కిల్ డీసీ సుజాతను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ.. 102 సంవత్సరాల కిందట అనేక పోరాటాలు, ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 44 చట్టాల్లో 29 చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసేస్తూ 4 కోడ్‌లు తీసుకువచ్చి కార్మికుల హక్కులను హరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా,రైతు వ్యతిరేక విధానాలతో 47 కోట్ల మందికి నష్టం కలుగుతున్నందున సందర్భంలో ఇప్పటికి 27 సార్లు సమ్మెలు కోడ్‌ల అమలును ఆపుతుంది అందులో భాగంగా నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రైవేటు పడేనా?

పుట్టగొడుగుల్లా గుర్తింపు లేని పాఠశాలలు | అరకొర వసతులతో నిర్వహణ



దిల్‌సుఖ్‌నగర్: విద్యా సంవత్సరం ప్రారంభం కావస్తున్నా అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించలేదు. ఇప్పటి నుంచే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల కోసం ఇంటింటికి వెళ్తున్నారు. అంతేకాక రకరకాల ప్రకటనలతో ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు విద్యార్థుల తల్లితండ్రులను ఆకర్షించే ప్రయత్నం ముమ్మరం చేస్తున్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులపై ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి జీఓను విడుదల చేయకపోవడంతో ఏ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలనే అయోమయంలో తల్లితండ్రులు ఉన్నారు.

రూ. లక్షల్లో ఫీజులు..

మలక్‌పేట్ జోన్ పరిధి వివిధ ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలల్లో ఉండాల్సిన కనీస సౌకర్యాలు లేవు. కానీ కార్పొరేట్ పాఠశాలల పేరుతో రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. సరూర్‌నగర్, సైదాబాద్, బాలాపూర్ మండలాల్లో గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలలు సుమారు 70కి పైగానే ఉన్నాయని అధికారులు చెబుతున్నా వారి దృష్టికి రాని పాఠశాలలు మరెన్నో ఉన్నాయి. గుర్తింపు లేని పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభించి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుండగా వాటిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఉన్నతాధికారులతో కుమ్మక్కై..

పేరుకు కార్పొరేట్ పాఠశాలలు, కానీ.. విద్యార్థులు ఆడుకోవడానికి కావాల్సిన ఆట స్థలాలు, మంచి నీటి సౌకర్యం, రవాణా, సరైన తరగతి గదులు ఉండవు. పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని ఆట స్థలంగా అధికారులకు చూపిస్తూ, ఇరుకు గదుల్లో పరిమితికి మించి విద్యార్థులతో కనీస అర్హత లేని ఉపాధ్యాయులతో చదువులు చెప్పిస్తున్నారు. జిల్లా అధికారులతో నేరుగా సంబంధాలు పెట్టుకుని కార్పొరేట్ స్థాయి పాఠశాలలు స్థానిక అధికారులు ఇచ్చిన నోటీసులను ఏ మాత్రం ఖాతరు చేయకుండా అడ్మిషన్లను కొనసాగిస్తున్నారు. జిల్లా అధికారుల కనుసన్నలలోనే గుర్తింపులేని పాఠశాలలు కొనసాగుతున్నాయని, వారి అండతోనే ఎలాంటి సౌకర్యాలు లేని పాఠశాలలు వేలల్లో ఫీజులు దండుకుంటున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

ఈ విద్యా సంవత్సరంలో అనుమతులు లేని, కనీస సౌకర్యాలు లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని సరూర్‌నగర్, బాలాపూర్, సైదాబాద్ ఎంఈఓ, డిప్యూటీ ఐఓస్‌లు తెలిపారు. మండలాల్లో గుర్తింపు లేని పాఠశాలలకు గతంలో పలుమార్లు నోటీసులు జారీ చేశామని, ఈ విద్యాసంవత్సరంలో మరోసారి అనుమతి లేని పాఠశాలలకు నోటీసులు ఇస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం.

విద్యాశాఖ అధికారుల ఉదాసీనత..

ఎలాంటి గుర్తింపు లేకుండా ఏళ్ల తరబడి పాఠశాలలు కొనసాగుతున్నా విద్యాశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు కఠినంగా వ్యవహరిస్తే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులుండవని పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు పేర్కొంటున్నారు. పాఠశాలల అనుమతులు లేని విషయం తెలియని అమాయక తల్లితండ్రులు తమ పిల్లల్ని ఆ పాఠశాలల్లో చేర్పించి వేలకు వేలు ఫీజులు చెల్లిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పార్కుల్లో పచ్చదనం పెంపొందిస్తాం


పార్కును పరిశీలిస్తున్న అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్: డివిజన్ పరిధిలోని పార్కుల్లో పచ్చదనం పెంపొందేలా చర్యలు తీసుకుంటామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కార్పొరేటర్ కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి కరణ్ బాగ్, ఇంద్రప్రస్థ కాలనీల్లో పర్యటించారు. కాలనీల్లోని పార్కులను సందర్శించిన కార్పొరేటర్ పార్కుల్లోని వసతుల గురించి, అక్కడ నెలకొన్న సమస్యల గురించి కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా హార్టీకల్చర్ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీనివాస్, సుదర్శన్, రాజసింహారెడ్డి, నాగిరెడ్డి, విజిత, జగన్ పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులు 18,121


నర్సింగ్‌రాజు, ఏఎస్‌ఓ

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–1 పరిధిలో కొత్త రేషన్‌కార్డుల కోసం మీ సేవా కేంద్రాల ద్వారా 18121 దరఖాస్తులు అందాయని సర్కిల్ ఏఎస్‌ఓ నర్సింగ్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంత్యోదయ కార్డుల కోసం 3889, అన్నపూర్ణ కార్డుల కోసం 1205, ప్రజావాణి నుంచి 133 దరఖాస్తులు వచ్చాయని మ్యుటేషన్ల కోసం 25403 అర్జీలు రాగా 19 వేల యూనిట్లు యాడ్ అయ్యాయని తెలిపారు. సర్కిల్–1 పరిధిలో మొత్తం 68868 కార్డులు ఉండగా అందులో 63774 ఎఫ్ఎస్ఎస్‌పీ కార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. మలక్‌పేట నియోజకవర్గంలో 5013, యాకత్‌పురా నియోజకవర్గం పరిధిలో 10897, సైదాబాద్‌లో 2211 కార్డులు ఉన్నాయని అన్నారు. కొత్త కార్డుల దరఖస్తుల్లో 4583 పరిశీలన పూర్తయ్యాయని అన్నారు. రేషన్ బియ్యాన్ని అమ్ముకుంటే కార్డులను రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు.

తాగునీటి సమస్యను తీర్చండి


పైప్‌లైన్ల లీకేజీని చూపుతున్న షేక్ మహమూద్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ వాంబే గృహవాసుల తాగునీటి సమస్యను పరిష్కరించాలని డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ కోరారు. బుధవారం ఆయన సింగరేణి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో సింగరేణి కాలనీలో 56 బిల్డింగ్‌లలో 1792 ఇళ్లను వాంబే గృహ సముదాయాల పేరిట నిర్మించారన్నారు. అప్పుడు నిర్మించిన ఇళ్లు ప్రస్తుతం పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నారు. ఇక్కడి వాంబే గృహాలకు తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్లు పలుచోట్ల లీకేజీలు అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు వాటర్‌వర్క్స్ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నిధుల మంజూరుకు వినతి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: నియోజకవర్గం పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో పలు కాలనీలలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

భారీగా బెల్లం పట్టివేత



హస్తినాపురం: హైదరాబాద్ నగరం నుంచి నల్లగొండ జిల్లా దేవరకొండ ప్రాంతానికి బెల్లాన్ని కారులో తరలిస్తుండగా ఎస్టీఎఫ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై బాలరాజు వివరాల ప్రకారం.. గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న 570 కిలోల బెల్లం, 50కిలోల అల్లాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఈ బెల్లాన్ని నల్లగొండ జిల్లా దేవరకొండ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆంబోతు తండాకు తరలిస్తున్నట్లు కారు డ్రైవర్ రాజు విచారణలో వెల్లడించడంతో కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై బాలరాజు తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ బాలరాజ్‌తో పాటు కానిస్టేబుల్‌లు సంతోష్ , అరుణ్, యాదగిరి పాల్గొన్నారు.

ఎంపీకి వినతి

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి హరిహరపురం కాలనీ, విజయపురి కాలనీ ఫేస్–1 కాలనీల్లోని సమస్యలను పరిష్కరించి, అభివృద్ధికి కృషి చేయాలని కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి బుధవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి


జయంతి మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ మారుతిమందిర్‌లో బుధవారం వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాలు జరిగాయి. ఆలయ ధర్మకర్తలు చిట్టంపల్లి కిరణ్‌కుమార్, నరేందర్, చంద్రయ్య, సంధ్య, బొట్టు శ్రీను, శ్యామ్, కాంగ్రెస్ నాయకులు బద్దం సురేందర్‌రెడ్డి, నాగిరెడ్డి హాజరై వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రహ్లాద్ జోషి, గోవర్ధన్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో..

లింగోజిగూడ: వాసవి కన్యకపరమేశ్వరి మాత జయంతి మహోత్సవాన్ని రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్ లక్ష్మీ కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. జయంతి మహోత్సవం సందర్భంగా మహా అభిషేకం, గణపతి హోమం, నవీన్ శర్మ ఆధ్వర్యంలో సుమారు 600మంది మహిళతో కుంకుమార్చన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌గుప్తా, ఆబ్రాబాద్ మాజీ జెడ్పీటీసీ చిక్కుడు అనురాధ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సురేష్, కిరణ్‌కుమార్, బద్రీనాథ్, మహేశ్‌గుప్తా, రమాదేవి, రాధిక, విజయలక్ష్మీ, మదుసూధన్‌గుప్తా పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న సురేందర్‌రెడ్డి, కిరణ్, చంద్రయ్య నరేందర్

కొత్తపేటలో..

నాగోలు: ఇంటర్నేషనల్ వాసవి మహిళా సమాఖ్య(ఐవీఎంఎఫ్) అధ్యక్షులు ఉప్పల రాజ్యలక్ష్మి, కొమరిశెట్టి ఝాన్సీ ఆధ్వర్యంలో బుధవారం కొత్తపేటలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమ అర్చన, దూప దీప నైవేద్యం, లక్ష పసుపు కొమ్ములతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 1000 మందికి పైగా మహిళలకు పసుపు కొమ్ములని అందజేశారు.

నిరాశ్రయులకు 'డబుల్' ఇళ్లు ఇస్తాం

కలెక్టర్ హామీ

నాగోలు: సాయినగర్ నిరాశ్రయులకు డబుల్ ఇళ్లు ఇస్తామని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ హామీ ఇచ్చారు. బుధవారం ఆయన ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డి, ఇతర రెవెన్యూ అధికారులు బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సాయినగర్ కాలనీలో ఉన్న స్థలంలో ఇక్కడి వాళ్లు ఒప్పుకుంటే మూడు ఫ్లోర్ల భవనాలు నిర్మించి డబుల్ బెడ్రూమ్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయం పై స్థాయి అధికారులు, హౌసింగ్ బోర్డ్‌కు తెలియజేసి పనులు మూడు నెలల్లో పూర్తి అయ్యే విధంగా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, సీపీఐ నాయకులు చందు నాయక్ పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేయాలి: ఎమ్మెల్యే

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి బుధవారం సాయినగర్‌లో పర్యటించి బాధితులకు భరోసా కల్పించారు. ప్రభుత్వం తరపున రావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించే బాధ్యత తనదేనని అన్నారు. తక్షణ సాయం కింద రూ.8 వేలు అందజేయాలని కోరారు. మంటల్లో కాలిపోయిన పత్రాల గురించి ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మళ్లీ పత్రాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. పట్టాలు లేనివారికి కూడా పట్టాలు ఇప్పిస్తామన్నారు. అనంతరం బాధితులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ డిప్యూటీ కమిషనర్ సుజాత, డీఈ. నీలిమ, నాగోలు డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చిరంజీవి, సీనియర్ నాయకులు చెరుకు ప్రశాంత్ గౌడ్,సతీష్ యాదవ్,చందు,శ్యామ్ సుందర్ రెడ్డి పాల్గొన్నారు.


కాలిపోయిన గుడిసెలను పరిశీలిస్తున్న కలెక్టర్


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవం


ఆరాధనోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 332వ ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్ మధురాపురిలోని స్వర్ణకారవీధిలో నిర్వహించిన ఆరాధన ఉత్సవాల్లో భాగంగా పూజాది కార్యక్రమాలు మూలమంత్ర హోమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జరగబోయే సంఘటనలను తన శక్తితో ముందే ఊహించి కాలజ్ఞానంలో రాసిన మహాపురుషుడు వీరబ్రహ్మేంద్ర స్వామి అని పేర్కొన్నారు. ద్వాదశాక్షర హోమం నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు శ్రీరామదాసు రవిచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రోజు వేణుగోపాల్, లవకుమార్, రాగిఫణి వెంకటరమణ, వెంకటాచారి, శ్రీనివాసచారి, రవికుమార్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న మధుయాష్కిగౌడ్

నాగోలు: సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు. నాగోలు డివిజన్ ఫతుల్లాగూడకు చెందిన దుర్గం బుచ్చయ్యకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. 2.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీని బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, చెరుకు చిరంజీవి, బద్రు,ప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.

అక్రమ వలసదారులపై చర్యలు తీసుకోవాలి


సీఐ సూర్యనాయక్ వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

నాగోలు: అక్రమ వలసదారులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాగోలు డివిజన్ అధ్యక్షులు పంగ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, బీజేపీ నాయకులతో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దేశంలో అక్రమంగా ఉన్న విదేశీయులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలనే ప్రయత్నంలో భాగంగా నాగోలు స్టేషన్ పరిధిలో అక్రమంగా నివసిస్తున్న ప్రత్యేకంగా రోహింగ్యాలు, బంగ్లా, పాకిస్తానీయులను గుర్తించడానికి వారి పరస్పర ధ్రువీకరణ చేపట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని సీఐ సూర్యనాయక్‌ను కోరారు. వినతి ఇచ్చిన వారిలో కేశిరెడ్డి పద్మ రెడ్డి, లయ కాలం శెట్టి, కొప్పెర శ్యామల, బద్దం బాలకృష్ణ గౌడ్, సిద్దాల ఐలయ్య, పాల్వాయి సంజీవ రెడ్డి, వస్పరి మల్లేష్, చంద్ర శేఖర్ గుప్త, చరణ్ రెడ్డి, శివ శంకర్, విజయ్ శంకర్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన పెంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నాగోలు: మనుషుల అక్రమ రవాణాపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని రాచకొండ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) ఎస్‌పీఓ కే. అరుణారెడ్డి, కానిస్టేబుల్ రజితా సూచించారు. రాచకొండ సీపీ సుధీర్ బాబు, ఏహెచ్ టీయూ సీఐ దేవేందర్ ఆదేశాల మేరకు బుధవారం శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ఎల్‌బీనగర్ జోనల్ క్యాంపస్‌లో మనుషుల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, లైంగిక దాడులు, వ్యభిచారం,తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు మాయమాటలతో బాలికలు, యువతులను మత్తు మందులు ఇచ్చి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయన్నారు. అనుమానితులు కలిసిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదుల అంతం


ఎల్‌బీనగర్ చౌరస్తాలో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న నర్సిరెడ్డి


సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

నాగోలు: కశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిపై ప్రతీకారం తీర్చుకుంటూ భారత ఆర్మీ ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా చేపట్టినందుకు బుధవారం కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయి కోటి పవన్ కుమార్ ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి పాల్గొన్నారు.

మోహన్‌నగర్ చౌరస్తాలో..

బీజేపీ నాయకుడు యశ్పాల్ గౌడ్ ఆధ్వర్యంలో మోహన్ నగర్‌లో ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా బాణాసంచా పేల్చి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్తాన్ చేసిన ఉగ్రదాడికి ప్రతి చర్యగా దేశ సైన్యం చేసిన ఆపరేషన్ సిందూర్‌పై గర్వపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్, కొర్లపల్లి రాజు, సంప్రీత్, యశ్వంత్ పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ చౌరస్తాలో..

మన్సూరాబాద్: ఉగ్రవాద స్థావరాలపై భారత సైనికులు చేసిన దాడులు ఆపరేషన్ సిందూర్... భారత సైనికుల అఖండ నిబద్ధతకు గుర్తుగా నిలుస్తుందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మన్సూరాబాద్ నుంచి ఎల్‌బీనగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, బాణాసంచా పేల్చి విజయోత్సవాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హరీష్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, ఎంజాల జగన్, పాతూరి శ్రీధర్‌గౌడ్, కిరణ్, మాధవి, కవితారెడ్డి, ముత్యంరెడ్డి, కడారి యాదగిరి యాదవ్, రాఘవేందర్, కిరణ్‌రెడ్డి, ధర్మేందర్, మధుకర్, జయతేజ, ఎల్లారెడ్డి, నవీన్, శేఖర్, మహేష్ పాల్గొన్నారు.విష్ణు, మల్లికార్జున్, విగ్నేష్, సాయి కిరణ్, మనోజ్, జగన్ తదతరులు పాల్గొన్నారు.


మోహన్‌నగర్‌లో..